5

# క్రైస్తవ పరిచర్య హృదయం

## (ఎఫెసీయులకు 4:7-16)

మార్పును గూర్చిన ప్రక్రియను దేవుడు ఎఫెసీయులకు 2లో అద్భుతంగా వివరించాడు. ప్రజలు పాపపు అంధకారం నుండి తప్పించుకునేందుకు ఒక మహిమాయుక్త ప్రణాళిక వేయబడింది (చూడండి ఎఫెసీయులకు 2:8, 9). మార్పు యొక్క ఫలితాలను ఇలా క్లుప్తీకరిస్తున్నాడు: "మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరిచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియైయున్నాము" (ఎఫెసీయులకు 2:10). క్రైస్తవుడు రక్షింపబడిన తరువాత తనను తాను దేవుని సేవకునిగా భావిస్తాడు.

ఒకవ్యక్తి రక్షింపబడిన తరువాత, అతని వైఖరి మారిపోతుంది కాబట్టి అతడు పరిచర్య చేస్తాడని మరో సమాంతర వాక్యం చెప్తుంది: "దాసులారా, మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కంటికి కనబడవలెనని కాక, ప్రభువునకు భయపడుచు శుద్ధాంతకరణ గలవారై శరీరమును బట్టి మీ యజమానులైన వారికి అన్ని విషయములలో విధేయులైయుండుడి" (కొలొస్సయులకు 3:22బి). మారిన వ్యక్తి ప్రతి పనిని దేవుని చిత్తానికి విధేయుడుగా చేస్తాడు. మంచి పనులు చేసేందుకు నిర్మించబడిన క్రైస్తవుడు దేవుని సేవించుట కొరకే పని చేస్తాడు. అతడు ఏం చేసినా దానిలో దేవుని ప్రేమను చూపిస్తాడు. అతని పని ద్వారా ఇతరులు క్రైస్తవ్యపు వెలుగును, కీర్తిని, చూస్తారు మరియు దేవునికి మహిమ కలుగుతుంది (మత్తయి 5:14-16). మంచి పనులు చేయడం వలన ఈ లోకంలోనూ తదుపరి జీవితంలోనూ ఆశీర్వాదం కలుగుతుంది (ప్రకటన 14:13). క్రైస్తవుడు వీటిని ఆనందంతో చేస్తాడు. అటువంటి పనులలో అతడెంతో ఆనందిస్తాడు. ఎందుకంటే ప్రతి పని ద్వారా రక్షణానందం వ్యక్తపరచబడుతుంది.

క్రైస్తవునికి రెండు రకాల పరిచర్య ప్రాంతాలున్నాయి అది సమాజం (తీతు 3:1) మరియు సంఘం (యూదా 20; 1 కొరింథీయులకు 12:12-27). సంఘాన్ని అభివృద్ధి పరిచే పరిచర్య విషయమై మంచి వైఖరి కలిగియుండాలని పౌలు ఇలా చెప్తున్నాడు - "నాకు కలిగినది యావత్తు మీ ఆత్మల కొరకు బహు సంతోషముగా వ్యయపరిచెదను. నన్నును నేను వ్యయపరచుకొందును" (2 కొరింథీయులకు 12:15ఎ).

ఇటువంటి సేవా వైఖరి ఎఫెసీయులకు 4:7-16 లో చర్చించబడింది. "సంఘంలోనున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పనిచేయుచుండగా, ప్రేమ తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు (సంఘమునకు) అభివృద్ధి కలుగజేసు కొనుచున్నది" (16 వచనం). ప్రతి వ్యక్తికి తలాంతులున్నాయి. అవి "క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును" (12 వచనం) వాడబడాలి. సంఘాన్ని అభివృద్ధి చేసేందుకు నీవేం చేస్తున్నావు? నీ సహోదరులను క్రీస్తునందు ఎదుగునట్లు

నీవెలాంటి పరిచర్య చేస్తున్నావు? ఇప్పుడు నీ వైఖరి క్రీస్తులోనికి మార్చబడింది. ఇది దైవిక పరిచర్యలో శ్రమ పడేందుకు నీకేలా సహాయం చేస్తుంది?

క్రైస్తవులైనవారు మంచి పనులు చేసేందుకు దేవునిచే ప్రత్యేకపరచబడ్డారు. మంచి వైఖరిని, దేవుని మహిమపరిచే పరిచర్యలో ప్రతి క్రైస్తవుడు పాలుపొందాలి. మారిన విశ్వాసి తన జీవితంలోని ప్రతి విషయంలోనూ సేవా హృదయాన్ని మాత్రమే చూపించడు గాని, సంఘానికి క్షేమాభివృద్ధి కలిగించు ప్రతి సత్క్రియను చేసేందుకు తనను తాను సమర్పించుకుంటాడు. ఒకవ్యక్తి తన సమాజంలోని అనేక మంచి పనుల్లో పాల్గొనవచ్చు గాని, అతడు దేవుని సంఘంలో మంచి పనులను చేయలేకపోవచ్చు. ఈ పాఠం క్రైస్తవ పరిచర్యను గురించి వివరించి సంఘంలో పరిచర్య ఎందుకు చేయాలో చెప్తుంది.

## క్రైస్తవ పరిచర్య ప్రత్యేకమైనది (4:7)

ప్రతి క్రైస్తవునికి పరిచర్య చేయగల సామర్థ్యం ఉంది. దేవున్ని సేవించే అవకాశం "మనకందరికీ" ఇయ్యబడిందని పౌలు పేర్కొన్నాడు. స్థానిక సంఘంలో ఏదో విధంగా సహాయపడేందుకు ప్రతి ఒక్కరికీ సామర్థ్యం ఉంది. క్రీస్తు కృప ప్రతి సంఘ సభ్యునికి ఇయ్యబడింది. దీని ద్వారా నూతన క్రైస్తవునికి సహితం పరిచర్య చేసేందుకు అవకాశం ఉంది. ఈ కృప దేవుని సేవించేందుకు ప్రతి ఒక్కరికి బలాన్ని, ప్రోత్సాహాన్ని, ప్రేమను, శ్రద్ధను దయచేస్తుంది. సంఘంలో దేవుని పని చేయుటకు ప్రతి వారికి శక్తి ఇయ్యబడింది.

స్థానిక సంఘాన్ని అభివృద్ధి పరిచేందుకు మీరు ఎలా సహాయపడతారు? మీ కంటూ ప్రత్యేకంగా ఎలాంటి తలాంతులు, సామర్థ్యాలు ఉన్నాయి? ఇతరులు చేస్తున్న పనిని మీరు చేయనక్కర్లేదు. మీరు చెయ్యాల్సిందల్లా మీకియ్యబడిన తలాంతుల ఆధారంగా దేవుని సేవించడమే! అనేకమంది తమను తాము చూసుకుని, "నాకేమి పెద్ద తలాంతులు లేవు. నాకు చిన్న తలాంతులే ఉన్నాయి" అని అనుకుంటారు. ఈ వైఖరినే ప్రవక్త జెకర్యా ఖండిస్తున్నాడు. చిన్న క్రియలే జరిగాయి కాబట్టి ప్రతిదీ వైఫల్యం అని అనుకుంటున్న ఒక గుంపు వారితో జెకర్యా మాటలాడుతున్నాడు. ప్రవక్త ద్వారా దేవుడిలా మాట్లాడుతున్నాడు – "కార్యములు అల్పములైయున్న కాలమును తృణీకరించిన వాడెవడు?" (జెకర్యా 4:10ఎ).

స్థానిక సంఘం క్షేమాభివృద్ధి పొందేరీతిగా ప్రతి ఒక్కరూ సేవ చేయాలని దేవుడు కోరుతున్నాడు. ఒకవేళ విశ్వాసులు తమ తలాంతులు, పనులు "అల్పమైనవి" అప్రధానమైనవి అని ఎంచితే దేవుడు కోరుతున్న పరిచర్యను వారు జరిగించనట్లే! దేవుడు "మనలోని ప్రతి ఒక్కరికి" తలాంతులు ఇచ్చాడని ఆయన్ను సేవించేందుకు వాటిని ఉపయోగించాలని పౌలు ఎఫెసీయులకు వ్రాస్తూ గుర్తుచేస్తున్నాడు.

సంఘం కూడుకొనుటకు ఒక అందమైన భవన నిర్మాణమును గురించి ఒక కథ ఉంది. దాన్ని చూసేందుకు అనేక మంది వచ్చేవారు. అందరూ చిత్రించబడిన గోడ మీదనున్న రంగురంగుల చిత్రాలు, చిత్రించబడిన కిటికీ అద్దాలు, మెత్తని కుర్చీలు, కళాత్మకంగా నున్న ప్రసంగ పీఠం వంటి వాటిని చూచి ప్రజలు చాలా గొప్పగా చెప్పేవారు. పైకప్పు మీద పెంకులను పట్టుకున్న ఒక మేకు ఈ మాటలను వింది. ఎవరూ తనను పొగడడం ఇంతవరకూ వినలేదు అన్నది ఆ మేకు. "నేను అల్పుడ్ని, నన్నెవరూ గుర్తించడం లేదు, నన్నెవరూ పొగడడం లేదు, నా అవసరం ఇక్కడ లేదు, నేనెవరికీ అక్కర్లేదు" అనుకుంది. ఒంటరిగా

భావించి ఒకరోజు తనను తాను బయటకు లాగేసుకుంది. అక్కన్నుంచి దొర్లుకుంటూ క్రింద పడిపోయింది. ఆ రాత్రి పెద్ద వర్షం రాగా మేకు మట్టిలో కప్పబడిపోయింది. ఆ వర్షానికి మేకు లేకపోవడంతో పెంకు జారిపోయి క్రింద పడిపోయింది. దాంతో వర్షం ఆ అందమైన చర్చిలోకి వచ్చేసింది. అందంగానుండే గోడలు మట్టితో నిండిపోయాయి. మంచి మెత్తని కుర్చీలు, నీటితో తడిసిపోయాయి. ఇదంతా కేవలం ఒక్క మేకు "నేను అల్పుడ్ని, నేను పనిచేయలేను" అనుకోవడంతోనే జరిగింది! (చూడండి 1 కొరింథీయులకు 12:22.)

క్రైస్తవుడు అవడం ద్వారా మీకియ్యబడిన ప్రత్యేక తలాంతులను మీ స్థానిక సంఘంలో ఉపయోగిస్తూ దేవున్ని సేవించే అవకాశం ఆయన మీకిస్తున్నాడు. మీ పనిని ఎన్నడూ తక్కువగా అంచనా వేయవద్దు. ఇతరులు చేస్తున్నది మీరు చెయ్యలేకపోతున్నారు కాబట్టి మిమ్మల్ని మీరు నిందించుకోవద్దు. మీకియ్యబడిన తలాంతులను పూర్తిగా వినియోగించండి.

> మన కనుగ్రహింపబడిన కృప చొప్పున వేర్వేరు కృపా వరములు కలిగినవారమై యున్నాము గనుక, ప్రవచనవరమైతే, విశ్వాస పరిమాణముచొప్పున ప్రవచింతము: ... పరిచర్యయైతే, పరిచర్యలోను; బోధించువాడైతే, బోధించుటలోను; హెచ్చరించువాడైతే, హెచ్చరించుటలోను; పని కలిగియుందము. పంచిపెట్టువాడు శుద్ధమనస్సుతోను; పై విచారణ చేయువాడు జాగ్రత్తతోను; కరుణించువాడు, సంతోషముతోను, పని జరిగింపవలెను (రోమీయులకు 12:6-8).

దేవుని చేత ఆశీర్వదించబడేందుకు అల్పమైనది చిన్నదేమి కాదు! క్రైస్తవునిగా నీ ప్రధాన విధి నీవు చేయగలిగినంత సంఘం కోసం చేయడం. తద్వారా సంఘం బలపడి విశ్వాసంలో స్థిరపడి దేవుడు ఆశించిన విధంగా ఎదుగుతుంది. దేవుని రాజ్యంలో పరిచర్య చేసేందుకు నీవు నియమించబడ్డావు.[2] మార్కు 14:8ఎ: "ఈమె తన శక్తి కొలది చేసెను" అని చెప్పబడిన రీతిగా మనం కూడా ప్రభువు ఎదుట చెప్పబడునట్లు ప్రయత్నిద్దాం.

## క్రైస్తవ పరిచర్య పరస్పరమైనది (4:7బి-10)

దేవుని సేవించడంలో క్రైస్తవుడు తన తలాంతులను ఎందుకు ఉపయోగించాలి? సమాధానం చాలా సులభం! క్రీస్తు చేసిన పరిచర్యను దృష్టిలో ఉంచుకొని ప్రతి క్రైస్తవుడు ప్రభువు వలెనే పరిచర్య చేయాలని భావిస్తాడు! (చూడండి గలతీయులకు 2:10; 1 తిమోతి 1:12-17.) వినయ మనస్సు గల సేవకునిగా ఉండాలని పౌలు ఫిలిప్పీయులకు చెప్తూ, అతడు ప్రభువు మాదిరిని గొప్ప మాదిరిగా వారి ముందు ఉంచుతున్నాడు. "క్రీస్తుయేసునకు కలిగిన ఈ మనస్సును మీరును కలిగియుండుడి" అని వ్రాస్తున్నాడు (ఫిలిప్పీయులకు 2:5).

క్రీస్తు ఈనాడు పరిచర్య ఫలాలను అందిస్తున్నాడు. ఎందుచేతనంటే ఆయనే ఈ లోకానికి వచ్చి మరణాన్ని అనుభవించాడు. క్రీస్తు యాగాన్ని మనం అర్థం చేసుకుంటే, మనమూ మనఃపూర్వక పరిచర్య చేస్తాము. క్రీస్తు యొక్క దాసుని స్వరూపాన్ని ఫిలిప్పీయులు గ్రహించి, దానికనుగుణంగా అనుసరించారు. వారు పౌలు చేత ఇలా ప్రోత్సహించబడ్డారు; "మీ లెక్కకు విస్తార ఫలము రావలెనని అపేక్షించి చెప్పుచున్నాను. నాకు సమస్తమును సమృద్ధిగా కలిగియున్నది. మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని యేమియు తక్కువ లేక యున్నాను. అవి మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునైయున్నవి" (ఫిలిప్పీయులకు 4:17బి, 18).

క్రీస్తుయేసు చేసిన అసాధారాణమైన పరిచర్యను అభినందిస్తూ క్రైస్తవులు సంఘంలో పరిచర్య జరిగించాలి, మీ తలాంతులను గమనించండి సంఘం పరిశుద్ధ విశ్వాసంలో ఎదుగునట్లు వాటిని సంఘంలో వినియోగించండి!

## క్రైస్తవ పరిచర్య నిర్మాణాత్మకమైనది (4:11)

ఒక నిర్దిష్ట విధానంలో పని చేయునట్లుగా దేవుడు తన సంఘాన్ని నిర్మించాడు. ఆయన ఆ నిర్మాణాన్ని తన గ్రంథంలో, బైబిలులో ఉంచాడు. మనం దానిలో మార్పులేమీ చేయనక్కర్లేదు. క్రైస్తవులు ఆ విధాన్నాన్ని అనుసరించాలని దాన్ని మార్చనక్కరలేదని దేవుడు ఆశిస్తున్నాడు (1 కొరింథీయులకు 4:6).

దేవుని సంఘంలో మొదట తాత్కాలిక విధానం, తరువాత శాశ్వత విధానం కనబడుతుంది. సంఘం మొదట స్థాపించబడినప్పుడు అపొస్తలులు, ప్రవక్తలు అవసరమయ్యారు. దేవుని బయల్పాటు వ్రాయబడినపుడు ఇక అపొస్తలులు, ప్రవక్తలు అవసరం లేదు. ఎందుకంటే దేవుని బయల్పాటును ఇతరులు చదివి ఆయన ప్రణాళికను అర్థం చేసుకోగలరు (ఎఫెసీయులకు 3:3-5). అయితే బలుపరచబడినవి వ్రాయబడిన తరువాత వాటిని ప్రపంచమంతటా బోధించాల్సిన అవసరం ఉంది. దేవుని సంఘంలో శాశ్వతంగా పనిలో నుండువారు ఈ బోధను చేస్తారు. శాశ్వత పనులు అంటే, సువార్తికులు (సువార్తను ప్రకటించువారు) కాపరులు (స్థానిక సంఘాన్ని పర్యవేక్షించే పెద్దలు) మరియు బోధకులు (బయలుపర్చబడిన సత్యాన్ని బోధించువారు) ఈ శాశ్వత పనుల్లో నున్న వీరు సువార్తను ప్రకటించాల్సియుంది. తద్వారా దేవుని వాక్యం సరిగా వ్యాప్తిచెందుతుంది. ఈ శాశ్వత పనుల్లో లేని క్రైస్తవులు ఆ వాక్యాన్ని విని దేవుడిచ్చిన ఆజ్ఞలను గైకొని ఇతరులు ఆయన వాక్యాన్ని అనుసరించులాగున ప్రోత్సహించాలి.

నూతన క్రైస్తవునిగా దేవుని వాక్యాన్ని ఇంకనూ నేర్చుకొని విశ్వాసంలో ఎదగాలి. దేవుని సత్యాన్ని ఇంకనూ నేర్చుకునేందుకు ఉండే అవకాశాల గురించి ఆలోచించండి. సువార్త ప్రకటింపబడినప్పుడు బోధకులు దేవుని వాక్యాన్ని బోధిస్తున్నపుడు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

## క్రైస్తవ పరిచర్య ఫలభరితమైనది (4:12-16)

ప్రతి క్రైస్తవుడు సంఘంలో ఎందుకు పరిచర్య చేయాలి? ఈ వైఖరి మాత్రమే స్థానిక సంఘాన్ని బలపరుస్తుంది. ప్రతి క్రైస్తవుడు స్థానిక సంఘంలో పని చేసినప్పుడు మూడు విషయాలు జరుగుతాయి. *మొదటిగా, సంపూర్ణ ఐక్యత ఉంటుంది* (13ఎ వచనం). సంఘంలో పరిచర్య చేయడంలో నిమగ్నమైన వారికి విబేధాలను సృష్టించే సమయం గాని, సందర్భం గాని దొరకదు (1 థెస్సలొనీకయులకు 4:9-12; 2 థెస్సలొనీకయులకు 3:11-13). సంఘంలోని వారందరూ పరిచర్యలో ఆనందంగా పాల్గొనాలంటే సంఘంలో ఆనందకర ఐక్యత ఉంటుంది. *రెండవదిగా, క్రీస్తును గురించిన జ్ఞానం ఉంటుంది* (13బి వచనం). క్రీస్తును గురించిన జ్ఞానం కలిగియుండడం ద్వారా ఎటువంటి వైఖరి కలిగియుండాలి, ఎటువంటి పరిచర్య జరిగించాలి అన్న అవగాహన సంఘంలో ఉంటుంది. *మూడవదిగా, సంఘంలో ఎదుగుట ఉంటుంది* (13సి వచనం). సంఘంలో విభిన్న పనులు చేస్తున్న వారు విశ్వాసంలో ఎదుగుతుంటారు.

ప్రభువు నిమిత్తం ఫలభరితంగా ఉండేందుకు సంఘంలోని వారందరూ బాధ్యత కలిగియుండాలి. ఇతరులను క్రీస్తునొద్దకు నడిపించేందుకే క్రైస్తవులు రక్షింపబడ్డారు. స్థానిక సంఘంలోని వారు ఒకరినొకరు పరస్పర అవయవములు కాబట్టి దేహం సరిగా పనిచేయునట్లు కృషి చేయాలి. సంఘాన్ని బలపరిచేందుకు పరిచర్య నిమిత్తం పరిశుద్ధులను ప్రోత్సాహించేలా దేవుడు తన పరిశుద్ధ వాక్యాన్ని బయలుపరిచాడు. స్థానిక సంఘంలోని ప్రతి ఒక్కరూ పనిచేస్తే తప్ప ఆ సంఘ సంపూర్ణతను సాధించలేదు. ప్రతి సంఘ సభ్యుడు సంఘ "ఎదుగుదలకు" బాధ్యుడు అని 16వ వచనం చెప్తుంది. సంఘాన్ని ప్రేమతో క్షేమాభివృద్ధి కలిగించేందుకు ప్రతి సభ్యుడు తన పాత్రను పోషించాలి!

నూతన క్రైస్తవునిగా, నీవు ఉత్సాహంగా, సమర్పణతో పాల్గొనాల్సిన అవసరత ఉంది. ఎందుకు? ఎందుకంటే, ప్రతి సభ్యునికి తాను ఎలా పరిచర్య చేస్తున్నాడో దానికి అతడు బాధ్యుడు. ప్రతి విశ్వాసికి ఒక తలాంతు ఉంది, పరిచర్య బాధ్యత ఉంది, ఆ తలాంతును స్థానిక సంఘంలో వినియోగించాలి, ప్రేమనుబట్టి దేవుని సంఘంలో ఉత్సాహంగా సేవచేయాలి అలాగే ప్రభువు యొక్క సారూప్యంలోకి మార్చబడేందుకు యత్నించాలి!

మీరు ఆరాధిస్తున్న చోటు సంఘంలో ఫలభరితంగా ఉండాలి. ఫలభరితంగా ఉండే విశ్వాసి అంటే అందరికీ ఆర్భాటంగా కనిపించే వాడు కానక్కర్లేదు. ఫలభరిత క్రైస్తవుడంటే క్రీస్తునకు కలిగిన మనసులో పరిచర్య చేయువాడు. దాని ఫలితంగా సంఘం ప్రేమలో ఎదుగుతుంది. సంఘస్థులు పరిచర్య చేయుటకు ప్రోత్సాహించబడాలి అపుడు విశ్వాసం బలపడుతుంది.

**ముగింపు విషయాలు**

ఎఫెసీయులకు 4:7-16లో ఎంత గొప్ప ప్రోత్సాహకర వాక్యం ఉంది! నూతన క్రైస్తవునిగా, మీరు స్థానిక క్రీస్తు సంఘంలో ఒక భాగమయ్యారు. ఈ సంఘంలో మీరు దైవిక పరిచర్య చేయాలి. మీ పరిచర్య *ప్రత్యేకమైనది.* మీరు ఏం చేయగలరో అదే చేయండి. మీ పరిచర్య *పరస్పరమైనది.* దేవుడు ఇష్టపూర్వకంగా మీకు పరిచర్య చేశాడు కాబట్టి మీరు పరిచర్య చేస్తున్నారు. మీ పరిచర్య *నిర్మాణాత్మకమైనది.* పరిచర్య నిమిత్తం బయలుపరచబడిన దేవుని ప్రణాళికను మీరు అనుసరిస్తున్నారు. మీ పరిచర్య *ఫలభరితమైనది.* మీరు క్రీస్తు శరీరమునకు క్షేమాభివృద్ధి కలుగజేస్తున్నారు!

క్రైస్తవుడగుట అనేది మీ జీవితంలో ఎన్నో ఆశీర్వాదాలను తెస్తుంది. ఒక గొప్ప ఆశీర్వాదం ఏమంటే, దేవుని పేరున మీరు ఇతరులకు పరిచర్య చేస్తున్నారు. మీ క్రైస్తవ పరిచర్య ద్వారా దేవునికి మహిమను తెస్తూ క్రీస్తు శరీరమను సంఘం ఎదిగేలా చేస్తున్నారు!

---

సూచనలు

[1]Wendell Winkler, *The Mission of the Local Church* (Fort Worth, Tex.: Winkler Publications, 1979), 9. [2]లూక 12:42, 43, 47, 48; 1 తిమోతి 1:12; ప్రసంగి 9:10.